

నేడు మూడో విడత రైతు భరోసా - పిఎం కిసాన్ నిధులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పి.ఎం.కిసాన్ - రైతు భరోసా మూడో విడత నిధులు మంగళవారం విడుదల కానున్నాయని జిల్లా వ్యవసాయశాఖ జెడి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 1,39,505 మంది రైతులకు రూ.29.57 కోట్లు జమ కానుందని పేర్కొన్నారు. 1,15,349 మంది రైతులకు రూ.23.46 కోట్లు, 2,572 మంది కౌలుదారులకు రూ.72 లక్షలు, 19,658 మంది అటవీ పట్టాలు పొందిన గిరిజన రైతులకు రూ.3.95 కోట్లు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులు 1926 మందికి రూ.1.45 కోట్లు జమ అవుతుందని ఆయన చెప్పారు.

కోరెడ్ల రమాప్రభ వైపు ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు

- పిడిఎఫ్ ఉద్యమాలు, ప్రభుత్వ అణచివేత చర్యలే కారణం
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ వాడీవేడి చర్చ


కలెక్టరేట్‌ను ముట్టడించిన ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ వైపు కనిపిస్తోంది. మరోవైపు ప్రయివేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, విద్యార్థుల్లోనూ అదే వాణి. ఇందుకు కారణం లేకపోలేదు. 2007లో ఏర్పడిన పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా ఒకటేమిటి? అన్ని తరగతులకు సంబంధించిన సమస్యలపైనా పోరాడుతోంది. చివరికి పెట్టుబడుల భాగస్వామ్యం పేరుతో చేపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలను కూడా చట్టసభల్లో కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో శాసన మండలిలోనూ, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా అధికార, ప్రధాన ప్రతిపక్షాలకు గుణపాఠం నేర్పేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధమౌతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో అధిక శాతం మంది పట్టభద్రులే. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనున్నారు. వీరంతా బంధువులు, గురుశిష్య సంబంధాలు, మిత్ర బృందాలను కూడా ప్రభావితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా ఎటువైపు ఉంటారన్న చర్చ జరగడం సర్వసాధారణం. కానీ, ఈసారి మారుమాట లేకుండా పిడిఎఫ్ బలపర్చిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆమె జీవితం సామాజిక సేవతో పెనవేసుకుని ఉంది. సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి పాటుపడవోయ్.. అన్న మహాకవి గురజాడ అడుగుజాడల్లో మహిళలు, గిరిజనులు, మత్స్యకారులు, పేదల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషిచేశారు. విద్యార్థులు, చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తనవంతు సేవలందిస్తూ ఖండాంతరాల్లో ఏర్పాటుచేసిన అనేక సదస్సుల్లో ప్రాతినిధ్యం వహించారు. ఆమె వ్యక్తిగత చరిష్మా సంగతి కాస్త అటుంచితే, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపర్చిన అభ్యర్థికావడం అత్యంత కీలక అంశంగా చెప్పొచ్చు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అటు శాసన మండలిలోనూ, ఇటు ప్రజాక్షేత్రంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై తమదైన శైలిలో గళమెత్తుతూనే ఉన్నారు. ముఖ్యంగా పిఆర్‌సి విషయంలో జరిగిన మోసాన్ని తేటతెల్లం చేయడంలో పిడిఎఫ్‌దే కీలకపాత్ర. మరోవైపు సిపిఎస్ రద్దుకోసం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటూ ప్రభుత్వాన్ని గర్జించారు. ఈ సమస్య ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి పట్టకపోయినా, ఉద్యోగుల తరపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిలబడి పోరాడుతున్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థను నాశనం చేయడంతోపాటు ఇటు ఉపాధ్యాయులకు అటు డి.ఎడ్, బిఇడి పూర్తిచేసి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడే నూతన విద్యావిధానాన్నీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వ్యతిరేకిస్తున్నారు. పిఆర్‌సి, సిపిఎస్, నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అణచివేత చర్యలు తారా స్థాయికి చేరాయి.

పిఆర్‌సి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయ లోకంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. చలో విజయవాడ, కలెక్టరేట్ ఎదుట ధర్నాల సందర్భంగా ఉపాధ్యాయులను పోలీసులతో ప్రభుత్వం గృహ నిర్బంధాలకు గురిచేసింది. ఇప్పటికీ బెదిరింపులు, అదిరింపులు కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రభుత్వం అనేక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందనేది వారి మనోగతం. ఇటువంటి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్షాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులకన్నా తమ కోసం పోరాడే పిడిఎఫ్ బలపర్చిన రమాప్రభే మేలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా ఒకటేమిటి చాలా మంది పట్టభద్రుల్లో చర్చసాగుతోంది.

ప్రయివేట్ టీచర్లకు వెల్ఫేర్ బోర్డు

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. సోమవారం విజయనగరంలోని పలు విద్యాసంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. అటువంటి ఫ్రంట్ తనను బలపర్చడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు సామాజిక సమస్యలపై పోరాడానని, పట్టభద్రులు అవకాశం కల్పిస్తే చట్టసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రయివేట్ విద్యాసంస్థల సిబ్బంది హక్కుల కోసం పనిచేస్తానని చెప్పారు. వారందరికీ గుర్తింపు కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల గొంతుకనై పనిచేస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటేష్, పి.రామ్మోహన్, నాయకులు పావని, రామకృష్ణ, లావణ్య, సంధ్య, బాలాజీ, సోమేశ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


ప్రయివేటు ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ఎమ్మెల్సీ బరిలో 37 మంది

- పట్టభద్రుల శాసన మండలి స్థానానికి ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం ఓట్లు 289214
- పోలింగ్ కేంద్రాలు 331
- మార్చి 13న పోలింగ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి పోటీలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. తన కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గానికి సంబంధించి పట్టబద్రుల శాసన మండలి ఎన్నికలపై ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డేడ చంద్రకళ పద్మావతి, ఈర్ల శ్రీరామమూర్తి, గూణూరు మళ్లనాయుడులు పోటీ నుంచి ఉప సంహరించుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 331 పోలింగు కేంద్రాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 59, విజయనగరంలో 72, పార్వతీపురం మన్యంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విశాఖపట్నంలో 112, అనకాపల్లిలో 49 పోలింగు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగు సిబ్బందికి ఈ నెల 28న, తిరిగి రెండో సారి మార్చి 7న శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్ స్థాయి అధికారులతో ఓటరుకు స్లిప్పులు, ఓటరుకు సంబంధించిన సమాచారం అందిస్తారని, ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటరు జాబితాను ప్రెసైడింగ్ ఆఫీసర్లకు మెటీరియల్‌తో అందజేస్తామని తెలిపారు.

ఓటర్లు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి 2,89,214 ఓట్లు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 52256 మంది, విజయనగరం జిల్లాలో 58502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11525 మంది, విశాఖపట్నం జిల్లాలో 105697 మంది, అనకాపల్లి జిల్లాలో 42714 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 15 మంది సెక్టార్/జోనల్ ఆఫీసర్లు, 15 మంది రూటు ఆఫీసర్లు, 112 మంది బూత్ స్థాయి ఆఫీసర్లు, 143 మంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, 443 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సూక్ష్మ పరిశీలకులు, 112 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు (అన్ని పోలింగు కేంద్రాలలో), ఒక మండలానికి 11 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు జిల్లాల్లో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థుల పేర్లు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టి ఎన్నికల కమిషన్ పరిశీలనకు పంపించామన్నారు.

పోలింగ్ సమయం

పోలింగు మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని, 4 గంటల తర్వాత వరుసలో ఉన్న వారిని వీడియో తీసి వారికి టోకెన్లు అందిస్తారని, వారు మాత్రమే ఓటు వేస్తారని తెలిపారు. పోలింగు పూర్తయిన తరువాత సంబంధిత స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారని, మరుసటి రోజున పోలీసు బందోబస్తుతో ఆయా జిల్లాల నుంచి తీసుకువచ్చి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలిపారు. మార్చి 16న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు 28 లెక్కింపు టేబుల్స్, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. వీడియోగ్రఫీ సమక్షంలో లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని అన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటినిగానీ, ఇంటి ఆవరణాన్నిగానీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. పోలింగు కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధమని, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు ఏజెంట్లుగా ఒకరిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

పోలీసు బందోబస్తు

నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 1162 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగు రోజున 840 మందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. 112 పోలింగు స్టేషన్లు, 43 పోలింగు లొకేషన్లు, 15 రూటు మొబైల్స్, ప్రతి పోలింగు స్టేషన్ వద్ద అక్కడ ఉన్న సమస్యల ఆధారంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రిజర్వ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికలు పూర్తయిన తరువాత స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద, స్ట్రాంగ్ రూం వద్ద సెంట్రల్ పారామిలటరీ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. లెక్కింపు రోజున పారామిలటరీ దళాలను అందుబాటులో ఉంచుతామన్నారు. తొలుత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తెలియజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఒడిశా ఫోకస్

- కొటియా గ్రామాల్లో పర్యటించిన సిఎస్
- సంక్షేమ పథకాల లబ్ధిపై ఎపి దృష్టి

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంపై ఒడిశా అధికారులు ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఈ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఒడిశా ప్రభుత్వం రూ.150కోట్లు కేటాయించింది. ఒడిశాలోని అన్ని గ్రామాలకు కొటియా గ్రామాలను కలుపుతూ ఒడిశా ప్రభుత్వం పక్కా రహదారులను నిర్మించింది. గ్రామాల్లోని పేద గిరిజనులకు ఉపాధి కల్పన కోసం కోళ్లు, మేకలు పంపిణీ చేశారు. ఎగువ శెంబి సమీపంలో ఉన్న గ్రామంలో స్ట్రా బెర్రీ పంటను రైతులతో సాగు చేయిస్తోంది. తేనె ఉత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కొటియా గ్రామాల గిరిజనులకు స్వయం ఉపాధి కల్పనే ధ్యేయంగా కొరాపుట్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అభివృద్ధి పనులు, ఉపాధి కల్పన యూనిట్ల పరిశీలనకు ఆదివారం ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్ చంద్ర మహాపాత్రో ఆయా గ్రామాల్లో పర్యటించారు. జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహమ్మద్ అక్తర్ తోపాటు ప్రధాన కార్యదర్శి సురేష్ చంద్ర మహాపాత్రో అభివృద్ధి పనుల తీరును పరిశీలించారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారి కొటియా గ్రామాల్లో పర్యటించిన దాఖలాల్లేవు. అయితే ఎపి ప్రభుత్వం కొటియా గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టడంతో ఒడిశా అధికారులు అభివృద్ధి పనుల వేగవంతంపై దృష్టి సారించారు. కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర కొటియా గ్రామాల్లో ప్రధాన గ్రామం దూళిభద్రలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అర్హులైన నిరుపేద గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల కొటియా గ్రామాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో వీరి దృష్టిని మరల్చేందుకు ఒడిశా ప్రభుత్వం అభివృద్ధి పనులపై దృష్టి సారించింది.



ఎగువ శెంబిలో పర్యటిస్తున్న సిఎస్ సురేష్‌చంద్ర మహాపాత్రో

క్షణక్షణం... భయం భయం

- పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మీ, నడుకూరు, కొట్టు గుమ్మడ, చిట్టిపూడి వలస గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు క్షణక్షణం భయపడుతూ కాలం గడుపుతున్నారు. ఇటీవల రౌతు త్రినాధరావు వరికుప్పలతో పాటు ఎం.సన్యాసి నాయుడు, వాన దామోదరరావు, కోడి తాతబాబు, వాసుదేవరావు, తాతబాబు తదితర రైతులకు చెందిన చెరకు, మొక్కజొన్న పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే చిటిపూడివలసకు చెందిన కుమిలి అప్పలస్వామి, జి.బుజ్జి, యమక అప్పలనాయుడుకు చెందిన 20 ధాన్యం బస్తాలు ధ్వంసం చేశాయి. రైతులు పంట నష్టాలు చవి చూడడంతో పాటు ప్రజలు కూడా పంట పొలాలకు వెళ్లేందుకు భయంతో కాలం గడుపుతున్నారు. మరోవైపు ఉపాధి పనులు చేసేందుకు కూలీలు వెళ్లలేక ఇళ్లకే పరిమితమైపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్నా కనీస ప్రభుత్వంగాని, అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాల్లేవు. గత 15 ఏళ్లగా ఈ ప్రాంతాల్లో ఏనుగులు సంచరించడంతో ప్రాణ, పంట నష్టాలు కూడా ఏర్పడుతున్నాయి. పంట నష్టాలతో పాటు కిమ్మికి చెందిన జి.రామ్మోహనరావు, అల్లుజు అప్పలనాయుడుకు చెందిన బోరు బావులను కూడా ఏనుగుల గుంపు నాశనం చేశాయి. నడుకూరు, కొట్టుగుమ్మడ తదితర గ్రామాల్లో ఇప్పటికీ ధాన్యం కొనుగోలు లేకపోవడంతో ధాన్యం బస్తాలు కళ్లాల్లో కుప్పలు, కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఏ క్షణంలో ఏనుగులు గుంపు వచ్చి వీటిని ధ్వంసం చేస్తాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును తరలించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చిట్టి పూడి వలసలో సంచరిస్తున్న ఏనుగు

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళావెంకట్రావు

ప్రజాశక్తి-పాలకొండ

రాష్ట్రంలో ప్రస్తుతం రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కమిడి కళావెంకటరావు అన్నారు. పట్టణంలోని నక్కలపేటలోని ఒక ప్రైవేట్ కల్యాణమండపంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి లోకేష్ చేపడుతున్న పాదయాత్రను అడ్డుకుంటున్నారన్నారు. పోలీసులను ఆయుధంగా ఉపయోగించి ఆంక్షలు విధిస్తున్నారన్నారు. అయితే ఎన్ని అడ్డంకులు విధించినా పాదయాత్ర ఆగదన్నారు. నిరంకుశతత్వ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. పాలకొండ, రాజాం రోడ్డు పనులు చేయడంలో ఇక్కడ ఉన్న అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. నాగవళిలో ఇసుక తోడుకోవడానికి నాయకులకు ఉన్న శ్రద్ధ రోడ్ల కోసం రూ.2 కోట్లు కేటాయించడంలో చూపడం లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అరకు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంట సంతోష్‌కుమార్, తంపటాపల్లి మాజీ సర్పంచ్ వంజరాపు ఈశ్వరరావు తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. విశాఖపట్నం - విజయనగరం - శ్రీకాకుళం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ సోమవారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ సిబ్బందిని గుర్తించామని, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సూక్ష్మ పరిశీలకులుగా కేంద్ర ప్రభుత్వ రంగంలో పనిచేసే వ్యక్తులను నియమించి ఒక దశ శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. ప్రతి విభాగానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. పోలింగ్ బాక్స్‌లను ఇప్పటికే పరిశీలించామని, మార్చి12న ఎన్నికల సామగ్రి పంపిణీ, ఎన్నికల అనంతరం సామగ్రి స్వీకరణ (రిసెప్షన్) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాలు సున్నితమైనవిగా పరిగణిస్తున్నామన్నారు. ఐదు రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. నాలుగు స్టాటిక్ బృందాలు నియమించామని అన్నారు.ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమగు పోలీస్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని సూచించారు. 37మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పత్రం తయారీ, రవాణా, ఓటింగ్ తదితర అంశాలపై జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి మద్యం విక్రయాలు ఉండరాదని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి

శాసనమండలి ఎన్నికల నిర్వహణలో సూక్ష్మపరిశీలకులు నిబంధనలు సక్రమంగా అమలు చేసేలా చూడాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సూక్ష్మపరిశీలకులు శిక్షణా తరగతులకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంట ముందుగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. మంచినీరు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బంది హాజరు పరిశీలించాలన్నారు. అబ్జర్వర్ డైరీలోని నిబంధనలు పాటించాలని, చెక్ లిస్ట్ ప్రకారం సరిచూసుకోవాలని తెలిపారు. డిఆర్‌ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు మైక్రో అబ్జర్వర్‌లు కీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. మార్చి 12న ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఎన్నికలకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 13 తేదీన పోలింగ్‌కు ముందు పారదర్శకతకు ఖాళీ బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్ సమక్షంలో చూపించి పోలింగ్ ప్రారంభించాలని అన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే పట్టభద్రులకు 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ అనుమతించిందని, గుర్తింపు కార్డు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పగడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణను అందించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి- బొబ్బిలి

సైన్స్‌తో సాంకేతిక అభివృద్ధి సాధించవచ్చునని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని కోరారు. సైన్స్ పై పట్టు సాధిస్తే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదం పడుతోందన్నారు. ప్రీప్రైమరీ స్కూల్ డైరెక్టర్ నిక్కీ శామ్యూల్ మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో జరిగిన సైన్స్ ప్రదర్శనకు సమానంగా విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శనకు పెట్టారన్నారు. రెండోరోజు సైన్స్ ప్రదర్శన తిలకించేందుకు అధిక సంఖ్యలో జనం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: బాల్య దశలోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నారాయణప్ప వలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. సోమవారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశాల ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక అభివృద్ధి అనేది ఆదేశ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో మాత్రమే కొలవబడుతుందన్నారు. విజ్ఞాన శాస్త్రం మానవ జీవితం తో విడదీయరానిదని అన్నారు. విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం పట్ల ఇష్టాన్ని, దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సివి రామన్ జీవిత విశేషాలను, ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ను సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు శివకేశవరావు

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

పార్వతీపురంరూరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు శివ కేశవరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్.రత్నకుమార్, కార్యదర్శి డి.చంద్ర మౌళి, ఎపిటిఎఫ్ నాయకులు బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తల చిత్ర పటాలను ప్రదర్శించారు.



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంజీవరావు

పెదపెంకిలో చంద్రశేఖర్ ఆజాద్ 89వ వర్ధంతి

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో సోమవారం నేతాజీ గ్రంథాలయం వద్ద ఆ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవని ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ 89వ వర్ధంతి వేడుకలు ఆ గ్రామ యువత సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు పెద్దలు మాట్లాడుతూ చంద్రశేఖర్ సీతారాం తివారీ అసలు పేరుగా ఉండేదని ఆయన ఉద్యమాల్లో తన విజయం మన చూపించడంతో చంద్రశేఖర్ ఆజాదిగా మారారని వారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, తన ధైర్య సాహసాలతో ఉద్యమాల్లో మొదటి స్థానంలో ఉండేవాడని, స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధపడిన స్నేహితుల కోర్టు ఉరి శిక్ష వేసిన సందర్భంలో వారిని తప్పించడానికి తన ప్రాణాన్ని కాపాడ్డానికి కూడా వెనకాడ లేదని, ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బొమ్మలి హర్షవర్ధన్, ఎస్.ప్రసాద్, పి.తిరుపతినాయుడు, ఆటో యూనియన్ ప్రతినిధులు కె.మధు, కె.దుర్గారావు, ఎస్.రామకృష్ణ, కె.శంకర్, జి.తవిటినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్సులను శుభ్రం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

సీతానగరం : ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13న జరగనున్న నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఓటింగ్ బ్యాలెట్ బాక్సులను తహశీల్దార్ ఎంవి రమణ ఆధ్వర్యంలో శుభ్రం చేస్తున్నారు. ఎన్నికలకు ముందస్తుగా బ్యాలెట్ బాక్సులను శుభ్రం చేసి భద్రపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, విఆర్ఒ, విఆర్ఎలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

విద్యార్థులకు వరం 'జగనన్న గోరుముద్ద'

గుమ్మలక్ష్మీపురం : మధ్యాహ్న భోజనాన్ని జగనన్న గోరుముద్దగా అందిస్తుండడం విద్యార్థులకు వరమని స్థానిక సర్పంచ్ బోత్తాడ గౌరీ శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా నాడు నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.కిషోర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానందు, వార్డు సభ్యులు జి.వెంకట్రావు తదితరులు ఉన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు

జియ్యమ్మవలస : మండలంలోని పిప్పలభద్ర పంచాయతీలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను సోమవారం తొలగించారు. గ్రామ సర్పంచ్ వాన రాజు ఆధ్వర్యంలో కాలువల్లో చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాలువల్లో చెత్తాచెదారంతో పాటు మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు దోమలబారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీంతో అధికారులు సూచనల మేరకు చెత్తను తొలగించి కాలువలు శుభ్రపరుస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఎమ్మార్ నగరంలో రోడ్ల విస్తరణ పనులు ప్రారంభం

పార్వతీపురం రూరల్ : మండలంలోని ఎమ్మార్ నగరంలో రహదారి విస్తరణ పనులను ఆర్ అండ్ బి అధికారులు సోమవారం ప్రారంభించారు. రూ.17కోట్లతో ఆంధ్రా -ఒడిస్సా సరిహద్దు గ్రామాల కొరకు వెంకంపేట కూడలి నుంచి రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇప్పటి వరకు చిన్నబొండపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి కావడంతో ఇప్పుడు ఎం ఆర్ నగరంపై అధికారులు దృష్టి సారించారు. సోమవారం రహదారుల విస్తరణకు సంబంధించి మార్కింగ్ పనులను నిర్వహించారు. ఐదు మీటర్లు వెడల్పు ఉన్న రహదారిని ఏడు మీటర్లకు విస్తరణ జరుగుతుందని, అంతవరకు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టి సీసీ కాలువల నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు.



రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం


స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై తక్షణమే స్పందించి గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో సామాజిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలపై చర్యలు గురించి సంబంధిత అధికారులతో నేరుగా, ఫోన్‌ద్వారా మాట్లాడి తగిన విచారణ జరిపి వెంటనే పరిష్కారం చూపాల్సిందిగా ఆదేశించారు. 86 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి. స్పందన కార్యక్రమానికి వివిధశాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సీతంపేట : గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందన కార్యక్రమంలో వినతులు సమర్పించారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో ఎపిఒ రోషిరెడ్డి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. మండలంలో పులుగుమ్మికి చెందిన ఆనందరావు, బిలకర్ల, గొయ్యిగూడకు చెందిన సవర పాయి, జల్లార గ్రామానికి చెందిన కృష్ణారావు కొండసీపుర్ల వ్యాపారానికి రుణం ఇప్పించాలని కోరారు. జెమినివలసకు చెందిన ఎర్రం నాయుడు మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. బూర్జ మండలం జోగిపాడు, వెంకటాపురానికి చెందిన సవర సింగయ్య తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఒండ్రుజోలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన సవర దీపిక వినతి సమర్పించారు. సీతంపేట మండలం ధారపాడు గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాలకు సిసి రోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ వినతి సమర్పించారు. ఈ స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జి.మురళి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎఎంఒ పి.కోటిబాబు, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట : ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎపిఒ రోషిరెడ్డి



స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, ఎస్‌బి సిఐ ఎస్.శ్రీనివాస్, డిసిఆర్‌బి సిఐ ప్రభాకర్, ఎస్ఐ పి.దినకర్ పాల్గొన్నారు.

పి.ఆమిటిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పి.ఆమిటిలో సోమవారం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి వైద్యాధికారులు గుడివాడ ప్రభాకరరావు, పైల అభిలాష్ పాల్గొని, 90మందికి పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది భీమాశంకర్, సాంబరాజు, సురేష్ కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసిన వారిలో 18 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. వీరంతా బుధవారం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వై.యమునా ఎన్.రత్నప్రసాద్, సునీత, హైమవతి, సుధా నాగమణి పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - బలిజిపేట

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ గెలుపు కోరుతూ మండలంలోని ప్రజాసంఘాల నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. బలిజిపేటలో నిర్వహించిన ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ గెలిపిస్తే శాసనమండలిలో లోపల, వెలుపల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ నిరుద్యోగ సమస్యలపై పోరాడ్డానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి అవకాశం ఉంటుందన్నారు. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాలని నిర్ణయించడం రాష్ట్రానికి ద్రోహం చేయడమేనని, రాష్ట్రానికి, ఉత్తరాంధ్రానికి రావాల్సిన హక్కుల గురించి పోరాడి సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను చట్టసభల్లో వినిపించడానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని, నీతి, నిజాయితీ, అభ్యుదయ భావాలు గల కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వంజరావు సత్యంనాయుడు, వెన్నెల వేణు, భానుమూర్తి, దనాన త్రినాథ, గణపతి, శంకర్రావు, బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సురక్షిత నీరందించాలి

- కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అనారోగ్యం పాలు
- ఐద్వా ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో కుళాయిల ద్వారా కలుషిత నీరు (రంగుమారిన) సరఫరాతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, తక్షణమే సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో పట్టణ మహిళలతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు రంగు మారిన బురద నీరు వస్తుందని, ఇది దుర్వాసనతో కూడుకుందని అన్నారు. ఈ నీటిని తాగిన పట్టణ ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారన్నారు. మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం మున్సిపల్ ఆర్ఐ డిబ్బా రూబెన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ నాయకులు గెద్ద తులసి, మాన్యం గౌరమ్మ, బంకురు జయలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిరా, గొర్లి వెంకటరమణ,పట్టణ సిఐటియా నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

సీతానగరం : గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేద వ్యక్తం చేశారు. గతంలో నేరుగా వారి అకౌంట్లోనే ప్రభుత్వం జంప్ చేసిదని, ఇప్పుడు పంచాయతీల నుంచి జీతాలు చెల్లించాలని చెప్పడంతో సర్పంచులు దీన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి జీతాలు గతంలో మాదిరిగానే గ్రీన్ అంబాసిడర్ల అకౌంట్లోనే చెల్లించాలని అన్నారు. అనంతరం ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి కెకె వర్మకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌అంబాసిడర్ల సంఘం నాయకులు గౌరి, సిహెచ్ శివున్నాయుడు, జి.సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్ సూరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాచిపెంట

అసంఘటిత కార్మికులకు, హమాలీలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని, ఉపాధి కూలీలకు పని భద్రత కల్పించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బస్తాలు మోసే హమాలీలు చట్టాల కార్మికులు తోపుడు బండ్ల కార్మికులకు, హమాలీ కార్మికులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని అన్నారు. బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సిఐటియు. మండల ఉపాధ్యక్షులు చింత పోలి రాజు, పి.రామారావు, సుర్రు రామారావు, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మెస్‌ఛార్జీలు పెంచాలి

కురుపాం : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెస్‌ఛార్జీలు పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంకా మెస్‌ఛార్జీలు పెంచాలని ప్రస్తుతం పెంచిన మెస్, మెనూఛార్జీలు, చాలీచాలని ఛార్జీలు పెంచినట్లు ప్రకటించడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు బాగా పెరగడం వల్ల సరుకులు కొనుగోలుకు లేని పరిస్థితి ఉంటుందన్నారు. వసతి గహాల విద్యార్థులు అనారోగ్యంతో పౌష్టికాహారం లేక రక్త హీనత గురై మరణిస్తున్నారన్నారు. విద్యార్థులకు హాస్టళ్లలో పౌష్టికాహారం అందాలంటే మెనూ మెస్ చార్జీలు పెంచాలని, ఇప్పటికే ఆరు నెలలు కావస్తున్నా డైట్ బిల్లులు బకాయిలు లేక వసతి గృహ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున మెస్ చార్జీలు పెంచి, డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు వెంకటమణ, అజయ్ కుమార్ పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డ్ డిడి ఎం నాగార్జున

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - సీతంపేట

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం లభిస్తుందని నాబార్డు డిడిఎం నాగర్జున అన్నారు. మండలంలోని తూరాయివలస హెచ్ఎన్ టి ఫారంలో నాబార్డ్ సహకారంతో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జీవనోపాధుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా తేనెటీగల పంపకంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో మహిళలు మెలకువలు పాటిస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో దేనికి మంచి గిరాకీ ఉంటుందో దాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని తెలిపారు. రీసోర్స్‌పర్సన్ కాంతారావు మాట్లాడుతూ తేనెటీగలు పెంపకం ఆదివాసీ ప్రాంతాల్లో పువ్వులు నుండి తేనెను తీయడం జరుగుతుందని, దీన్ని నేర్చుకుంటే ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. ఎన్.అనూప్ మాట్లాడుతూ శిక్షణ అందరూ బాగా నేర్చుకుంటే యూనిట్లు కూడా ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, ఆర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో సెలవు పెట్టించండి

- పారిశుధ్యం అధ్వానం
- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని కౌన్సిలర్లు ముక్తకంఠంతో ధ్వజమెత్తారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ అనారోగ్యంతో బాధపడితే సెలవు పెట్టించి ఇంకొకరికి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. సోమవారం వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు పారిశుధ్యంతో పాటు పలు సమస్యలపై మాట్లాడారు. సమావేశం ప్రారంభం కాగానే 24వార్డు బి.హైమ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్వహిస్తున్న చేపల దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రోడ్డుపైనే పడేస్తున్నారని చెప్పారు. దీనివల్ల కుక్కలు మాంసాహారానికి అలవాటు పడుతున్నాయని, భవిష్యత్తులో పిల్లలపై ఇవి దాడికి పాల్పడే అవకాశం ఉందని చెప్పారు. అలాగే దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణంలో మాంసం, చేపల దుకాణాల వద్ద వ్యర్థాలు పడి ఉంటున్నాయని, దీనివల్ల పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంటుందని కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ అనారోగ్యంతో ఉంటే మరొకరికి బాధ్యతని అప్పగించాలని, ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తుతున్నాయని కౌన్సిలర్లు పి.సింహాచలం, ఎం.సరోజిని, లింగాల దుర్గా చెప్పారు. బంగారమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, వేసవి ఎద్దడి దృష్ట్యా సమస్య తొందరగా పరిష్కరించాలని కౌన్సిలర్ పి.మధుసూదనరావు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ఛైర్‌పర్సన్ దీప్తి

పెదమార్కెట్‌లో శిథిలావస్థలో ఉన్న షాపుల్ని ఎప్పుడు కూలుస్తారని, కాలం చెల్లిన షాపులు ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు చెప్పారు. దీనిపై కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా పారిశుధ్య నిర్వహణలో లోపాలున్నాయని చెప్పారు. పెదమార్కెట్ షాపులకు సంబంధించి వివాదం కోర్టులో ఉన్నందున కూల్చివేత సాధ్యం కాదని చెప్పారు. వైస్‌చైర్ పర్సన్ జర్జాపు దీప్తి మాట్లాడుతూ కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ శంకరరావును కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రాఘవాచార్యులు, ఆర్ఐ అహమ్మద్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు అందజేత

పాలకొండ : పట్టణంలో కోటదుర్గమ్మ వారి ఆలయానికి జడ్డు దుర్గారావు కుమారుడు జయశంకర్, గీతాంజలి దంపతులు అమ్మవారికి 38 గ్రాముల 962 మిల్లీ గ్రాముల కాసులపేరును సమర్పించారు. అలాగే సిహెచ్ మహేశ్వరి 11 గ్రాముల 610 మిల్లీ గ్రాముల రెండు బంగారు శతిమానాలను, సంపత్ శతిమానాలు అందించారు. వీటిని ఇఒ రాధాకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మకు అందించారు.

ఘనంగా సిర్లి ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక దేవరవీధిలో సోమవారం ఘనంగా సిరి ఎల్లమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా మండలంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చేందుకు పెద్ద ఎత్తున వచ్చారు. ఎల్లమ్మ జాతరకు ఎంపిడిఒ కృష్ణమోహన్ రెడ్డి, ఎఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ వనం గుడికి వెళ్లి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా పంపిణీ చేశారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీ వద్ద సోమవారం సిర్లి యాత్ర ఘనంగా నిర్వహించారు. పోతన్న, ఎల్లమ్మలకు ప్రత్యేక పూజలు చేసేందుకు వీరఘట్టంతో పాటు బూరుగా చలివేంద్రి, దశమంతపురం, నడుకూరు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలో సోమవారం ఘనంగా సిర్లి,పోతన్న ఎల్లమ్మ జాతర జరిగింది. తెల్లవారు నుండి భక్తులు పెద్ద ఎత్తున గుడికి చేరుకుని బియ్యం,కోడి గుడ్లు, నల్ల ఉలవలు,వేప ఆకులు,తీసుకొని వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గుడి వద్ద భక్తులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి, పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేశారు..

నేడు నగర పంచాయతీ సాధారణ సమావేశం

పాలకొండ రూరల్ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, సభ్యులంతా హాజరుకావాలన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

పాలకొండరూరల్ : పట్టణంలో మంగళవారం 3,4,5,6,7,8 వార్డులకు నీటిసరఫరా నిలిపివేస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. అంపిలి ప్రాంతంలో మోటారు పంపు మరమ్మతులకు గురవ్వడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు.

13 బైకులకు వేలం

సీతానగరం : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో వివిధ కేసులలో సీల్ చేయబడిన 13 బైకులను వేలంపాట వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నీలకంఠం మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు సీల్ చేసిన వాహనాలను వేలంపాట వేశారని ఆయన అన్నారు. వేలం పాటదారులు పాల్గొని జయప్రదం చేశారన్నారు. కార్యక్రమంలో వేలంపాటదారులు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలో వాటపాగు, దుగ్గి, నవగాం గ్రామాల్లో ఉపాధిహామీ చట్టం ద్వారా జరుగుతున్న చెరువు పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు వేతనం పొందాల న్నారు. సమయ పాలన పాటించి పనులకు హాజరు కావాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ